క్లుప్తంగా

పటిష్టంగా ఓటర్ల జాబితా సవరణ

పలమనేరు: ఓటర్ల జాబితా సవరణ, ఓటరు సమగ్ర వివరణ కార్యక్రమాలను పటిష్టంగా, పారదర్శకంగా చేపట్టాలని డీఆర్వో, జిల్లా ఎన్నికల సహాయ అధికారి మోహన్‌కుమార్ ఆదేశించారు. పలమనేరు సమీపంలోని ఒక ప్రైవేటు భవనంలో శుక్రవారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మేకింగ్ ఆఫ్ ఎలక్ట్రోల్ డేటా అనే అంశంపై పలమనేరు, పుంగనూరు, కుప్పం నియోజకర్గాల ఎన్నికల అధికారులు, బీఎల్‌వోలు, డీటీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీఎల్వోలు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్‌ను జాగ్రత్తగా చేపట్టాలని సూచించారు. వయోజనులు ఓటు హక్కు కలిగి ఉండాలన్నదే ఎన్నికల సంఘం లక్ష్యమని, అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. ఇందులో భాగంగా 35 ఏళ్లకంటే ఎక్కువ వయసున్న ఓటర్ల ధ్రువీకరణ చేపట్టాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏపీడీ వెంకటరమణ

సదుం: ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా అమలుచేస్తున్న పథకాలను ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని అడిషినల్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణ తెలిపారు. సదుం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు వైద్య నిర్ధారణ పరీక్షల శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలు సాధారణ పిల్లల మాదిరి జీవనం గడపాలని సూచించారు. శిబిరానికి 60 మంది హాజరు కాగా 50 మందికి ఉపకరణాలు అవసరమని గుర్తించామని, వారికి త్వరలోనే పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు. ఎంఈవోలు నటరాజ్, దామోదర, హెచ్ఎం సుబ్రమణ్యం పాల్గొన్నారు.

దేశీయ ఆవుల పెంపకంపై రైతుల ఆసక్తి



రైతు కృష్ణంరాజు ఇంటిలో జన్మించిన పుంగనూరు జాతి పేయదూడ

చౌడేపల్లె: దేశీయ ఆవుల పెంపకంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ డి.రాజులూరుకు చెందిన కృష్ణంరాజు ఇంటిలో వున్న ఆవు పుంగనూరు జాతి పేయదూడకు జన్మనిచ్చింది. పశువైద్యాధికారి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆవుకు పుంగనూరు జాతి సెమన్ వేసి దేశీయ పశువుల ఉత్పత్తికి చర్యలు తీసుకున్నారు. పుంగనూరు జాతి బుల్లి పేయ దూడను స్థానికులు చూసి సెల్ ఫోన్లలో బంధించి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు.


భాష్యం స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని నిరసన



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నేతలు

పుంగనూరు: హోమ్ వర్క్ చేయలేదని విద్యార్థిని తల పగులగొట్టిన భాష్యం స్కూల్ ఉపాధ్యాయుడు, హెచ్ఎంను అరెస్ట్ చేయాలని, పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యార్థి సంఘాల ఐక్యవేదిక నాయకులు సురేష్, విజయభాస్కర్ రెడ్డి, అమృతతేజ్, విజయకుమార్, న్యాయవాదులు మనోహర్, కిషోర్‌కుమార్ మాట్లాడుతూ గాయపడిన విద్యార్థిని వైద్యం ఖర్చులను స్కూల్ యాజమాన్యమే భరించాలన్నారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. లేనిపక్షంలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎంఈవోతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

పలమనేరు: పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ మల్లికార్జునరావు, సిబ్బంది రామాంజినేయరెడ్డి, జీఎస్టీ అధికారి సుబ్రమణ్యం, స్థానిక ఏవో సంధ్యారాణి శుక్రవారం దాడులు చేశారు. స్టాకు వివరాలు, బ్యాలెన్స్, గ్రౌండ్ బ్యాలెన్స్‌ను పరిశీలించారు. బాలాజీ ట్రేడర్స్, నాగలింగయ్య, మనగ్రోమార్ దుకాణాల్లో అనుమతి లేకుండా నిల్వ ఉంచిన 20 టన్నుల ఎరువులను సీజ్ చేశారు. వాటి విలువ రూ.5.30 లక్షల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు.

రెచ్చిపోతున్న వైర్ల దొంగలు

గంగవరం మండలంలో దొంగలు రెచ్చిపోతున్నారు. వ్యవసాయ బోర్లు వద్ద ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లను చోరీ చేస్తున్నారు. వరుస చోరీలతో రైతులు లబోదిబోమంటున్నారు. దుండగులపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసి మళ్లీ మళ్లీ వైర్లు కొనుగోలు చేసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- వ్యవసాయ బోర్ల కేబుల్ వైర్ల వరుస చోరీలు
- సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలు
- దుండగులకు దేహశుద్ధి చేసిన రైతులు
- పోలీసులకు ఫిర్యాదు



బోరు నుంచి స్టార్టర్ వరకు దుండగులు కత్తిరించిన కేబుల్ వైరు



కేబుల్ వైర్‌ను దొంగిలించికెళ్తున్న సీసీ ఫుటేజీలో రికార్డయిన దృశ్యం

గంగవరం: మండలంలోని గండ్రాజుపల్లి, పసుపత్తూరు, కీలపల్లి పంచాయతీల్లో రైతులు వ్యవసాయ బోర్ల వద్ద ఏర్పాటుచేసిన కేబుల్ వైర్లు తరచూ చోరీలకు గురవుతున్నాయి. దుండగులు రాత్రుళ్లు మర్రిమాకులపల్లి, సరమట్లపల్లి, యర్రోనికుంట, నల్లదుమ్మనపల్లి, నాలుగురోడ్లు, పసుపత్తూరు, బాలేపల్లి, కీలపల్లి, జోగిరెడ్డికొత్తపల్లి, పొన్నమాకులపల్లి, గొల్లైలదొడ్డి(ఎగువ, దిగువ, నడిమి) గ్రామాల్లో సంచరిస్తూ పొలాల వద్ద వున్న స్టార్టర్ల వరకు లాగిన కేబుల్ వైర్లను కట్ చేసి ఎత్తుకెళ్తున్నారు. దాన్ని ఒక చోట కాల్చి అందులోని కాపర్ తీగను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో పంటలకు నీరు పెట్టేందుకు వేలాది రూపాయలు ఖర్చు చేసి మళ్లీ వైర్ తెచ్చుకోవాల్సి వస్తోందని బాధిత రైతులు రెడ్డెప్పరెడ్డి, ఆదినారాయణరెడ్డి, లోకేష్‌రెడ్డి, శ్రీనివాసులు, ధనుంజయరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, ధనకొండయ్య, చంద్ర, రాధాక్రిష్ణ, వెంకటరమణ, మల్లికార్జున, మంజునాథరెడ్డి, శివానందం తదితరులు తెలిపారు. గండ్రాజుపల్లి, కీలపల్లి పంచాయతీల్లో తాగునీటి బోర్లకు ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లను కూడా చోరీ చేయడంతో తాగునీటికి సమస్య ఏర్పడిందని గ్రామస్తులు చెబుతున్నారు.

ఊరి దొంగల పనేనా..

వ్యవసాయ పొలాల వద్ద వరుసగా కేబుల్ వైర్లు చోరీ అవుతుండడంతో బెంబేలెత్తిన రైతులు దుండగులను పట్టుకోవాలని నిర్ణయించుకున్నారు. బోర్లు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న దుండగులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన పొలాల వద్దకు అసలు వెళ్లడం మానేశారు. కొన్ని రోజుల తర్వాత ఒక బోరు వద్ద కేబుల్ వైర్ కత్తిరించుకెళ్లారు. రైతు గ్రామస్తులతో కలిసి సీసీ పుటేజీని పరిశీలించగా నల్లదుమ్మనపల్లికి చెందిన శివ, మర్రిమాకులపల్లికి చెందిన రవి, యర్రోనికుంటకు చెందిన మునేంద్ర, బైరెడ్డిపల్లి మండలం తాతిరెడ్డిపల్లికి చెందిన బాల, బాబు చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. వారిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. తామే చోరీలకు పాల్పడినట్టు అంగీకరించి కాపర్ వైర్‌ను గండ్రాజుపల్లి సమీపంలోని రజాక్ గుజిరీ దుకాణంలో విక్రయించినట్టు తెలిపారు. రైతులు అక్కడికి వెళ్లి పరిశీలించి చోరీ చేసి తెచ్చిన కరెంటు సామగ్రి కనిపించడంతో విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. దుకాణదారుడిపై కేసు నమోదు చేయాలని బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిపై గంగవరం, బైరెడ్డిపల్లి పోలీసు స్టేషన్లలో గతంలోనూ అనేక కేసులు నమోదైనట్టు తెలిసింది.



గుజిరీ అంగడిలో వున్న కరెంటు సామగ్రి

పిల్లల్లో అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించాలి



ఎంఈవోలకు సూచనలిస్తున్న ఇన్‌చార్జి డైట్ ప్రిన్సిపాల్ దామోదర రావు

చౌడేపల్లె : పిల్లల్లో అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించాలని ఇన్‌చార్జి డైట్ ప్రిన్సిపాల్ దామోదరరావు తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక ఎమ్మార్సీని తనిఖీ చేశారు. అనంతరం ఎంఈవోలు కేశవరెడ్డి, తిరుమలమ్మకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎఫ్ఎల్ఎం మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. విద్యార్థులతో తప్పనిసరిగా నోట్ బుక్స్ రాయించాలన్నారు. ప్రైమరీ పాఠశాలల విద్యార్థులతో వర్కు బుక్స్ రాయించడంతోపాటు అసెస్‌మెంట్ టెస్టులు పెట్టి ప్రగతి ఆధారంగా ప్రోత్సహించాలని సూచించారు. 2, 4, 8 మార్కుల ప్రశ్నలపై విద్యార్థులకు అవగాహన కల్పించి రానున్న పదో తరగతిలో ప్రతిభ చూపేలా చైతన్యం కల్పించాలని ఆదేశించారు. ఉన్నత పాఠశాలల విద్యార్థులు బ్రిడ్జ్ కోర్సులు పూర్తిచేసి విద్యాప్రగతిలో ముందుండేలా చూడాలన్నారు.

ఎంపీడీవోగా అప్పాజి



పుంగనూరు: పుంగనూరు ఎంపీడీవోగా అప్పాజి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన నెల్లూరు జిల్లాలో ఏవోగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా పనిచేస్తున్న లీలామాధవి చౌడేపల్లెలో పూర్తి బాధ్యతలు నిర్వహించనున్నారు.

వసతుల కల్పనకు కృషి

సదుం: మండలంలోని ఎస్టీ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో హరిబాబు తెలిపారు. ఆయన శుక్రవారం సదుం పంచాయతీ కొత్తపల్లెలో ఎస్టీలతో సమావేశమయ్యారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. పక్కా గృహాల మంజూరుకు కృషి చేస్తామని హౌసింగ్ ఏఈ ప్రణయ్ కుమార్ తెలిపారు. శ్మశానవాటిక, వీధి దీపాల సమస్యల పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

హోరా హోరీగా వాలీబాల్ పోటీలు



విజేతలతో ఉపాధ్యాయులు

పెద్దపంజాణి: మండలంలోని కరసనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి అండర్-14, 17 బాలబాలికల వాలీబాల్ పోటీలు హోరా హోరీగా జరిగాయి. మండలంలోని వివిధ పాఠశాలల నుండి 33 జట్లు పాల్గొన్నట్లు హెచ్ఎం అమరనాథ్ తెలిపారు. సీనియర్ బాలుర విభాగంలో ముత్తుకూరు, అమ్మరాజుపల్లి, బాలికల విభాగంలో ఎంజేపీపీ, కరసనపల్లి పాఠశాల జట్లు విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచాయి. అదే విధంగా జూనియర్ బాలుర విభాగంలో నేలపల్లి, అమ్మరాజుపల్లి, జూనియర్ బాలికల విభాగంలో నేలపల్లి శంకర్రాయలపేట పాఠశాల జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచినట్లు పీడీ అన్నాదొరై తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు చంద్రశేఖర్, ప్రసూన, అమర్, రెడ్డెమ్మ, రమణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్

పలమనేరు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని దస్తావేజు లేఖరులు శుక్రవారం పెన్‌డౌన్ చేశారు. అనంతరం సబ్‌రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో నూతనంగా ప్రవేశపెట్టిన విధానాల్లో సాంకేతిక సమస్యల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ విధానాన్ని మార్పు చేయడం లేదా సమస్యలను పరిష్కరించడమో చేపట్టాలని డిమాండ్ చేశారు. లేఖరులు పాతూరు సామి, కోటి పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేకు సహకరించాలి



స్వామిత్వ సర్వే చేస్తున్న అధికారులు

పెద్దపంజాణి: మండలంలోని చిన్నేపల్లి గ్రామంలో శుక్రవారం స్వామిత్వ సర్వే చేసినట్టు డిప్యూటీ ఎంపీడీవో శారదాదేవి తెలిపారు. ఆమె మాట్లాడుతూ గ్రామ కంఠాలలోని ఇళ్లు, ఖాళీ స్థలాలకు ఆస్తి యాజమాన్య హక్కు పత్రాలు ఇవ్వడానికి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వే సమయంలో ప్రజలు సహకరించి వారి ఇళ్లను, ఖాళీ స్థలాలను దగ్గరుండి సర్వే చేయించుకోవాలని పేర్కొన్నారు. ఎంపీడీవో బాలాజి, పీఎస్ వినోద్‌కుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంటు శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

బైరెడ్డిపల్లె : ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా వుండాలని బైరెడ్డిపల్లె, తీర్థం వైద్యాధికారులు విజయ్‌చంద్ర, అరుణ్‌కుమార్ తెలిపారు. వారు శుక్రవారం సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ నీటి నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భారీ వర్షానికి కూలిన విద్యుత్ స్తంభాలు



ఉధృతంగా ప్రవహిస్తున్న వెంకటేపల్లి కాలువ



విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేస్తున్న అధికారులు

వి.కోట : మండలంలో గురువారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణాపురం పంచాయతీ వెంకటేపల్లి హంద్రీ నీవా కాలువ ప్రవహిస్తోంది. నీటి ఉధృతికి చిన్నశ్యామ, నాగిరెడ్డిపల్లి చెరువులు నిండాయి. గంగమ్మ ఏరు ఎక్కువగా ప్రవహిస్తుండడంతో కుంబార్లపల్లి నుంచి కల్లుపల్లికి మీదుగా వెళ్లే రోడ్డులో రాకపోకలకు అంతరాయం కలిగింది. మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లు దెబ్బతిన్నాయి. మండలంలోని ఎర్రంపల్లి సమీపంలో రెండు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. దీంతో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. సమాచారం అందుకున్న అధికారులు స్తంభాలను మార్చి సరఫరాను పునరుద్ధరించారు.

బైరెడ్డిపల్లిలో భారీ వర్షం

బైరెడ్డిపల్లె : మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలవడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. రెండు రోజులుగా వర్షం కురుస్తుండడంతో వాగులు, వంకలు ప్రవహించి చెరువుల్లోకి నీరు చేరుతోంది. కైగల్ జలపాతం వద్ద నీటి ప్రవాహం పెరగడంతో పర్యాటకులు సందడి చేస్తున్నారు. తీర్థం సమీపంలోని వెంకటపతయ్య చెరువు మరవపోతోంది.



ప్రవాహిస్తున్న కైగల్ జలపాతం

జీసీల హక్కుల సాధనకు పోరాటాలు

పుంగనూరు: అన్ని విధాలా వెనుకబడిన బీసీల హక్కుల సాధన కోసం పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని ఆ సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి తెలిపారు. పుంగనూరులో శుక్రవారం బీసీ నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి బీసీ సంక్షేమ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. తద్వారా బీసీలను రాజకీయంగా, సామాజికంగాను చైతన్యం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో బీసీ సంఘం వ్యవస్థాపకుడు అద్దాల నాగరాజ, నారాయణస్వామి, నరసింహులు, మేకల విజయకుమార్, జెవి.నాగరాజు, చిట్టెమ్మ, షబాన, రెడ్డెప్ప, నాగరాజు, గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చెరువే



అండర్ బ్రిడ్జి వద్ద నిలిచిన నీటిలో ప్రజల రాకపోకలు

కుప్పం రూరల్ : చిన్నపాటి వర్షానికే కుప్పం పట్టణం సమీపంలోని డి.కె.పల్లి వద్ద ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిలో నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. దీంతో వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. బ్రిడ్జి నిర్మాణ సమయంలో వర్షపు నీరు బయటికి పోయేందుకు సరైన ఏర్పాట్లు చేయక పోవడంతోనే నీరు నిలుస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డులో హాకింగ్, హౌంట్‌ఫోర్డ్, పాలిటెక్నిక్ పాఠశాలలకు విద్యార్థులు వెళ్లాల్సి వుంటుంది. అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు ఏరియా ఆస్పత్రికి స్పెషలిస్ట్ డాక్టర్ల రాక

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శనివారం నిర్వహించనున్న స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమానికి ప్రైవేటు ఆస్పత్రులకు చెందిన స్పెషలిస్ట్ వైద్యులు రానున్నారని సూపరింటెంటెంట్ మమతారాణి తెలిపారు. ముఖ్యంగా ఫల్మనాలజిస్ట్, రేడియాలజిస్ట్, జనరల్ మెడిసిన్, ఆప్తమాలజిస్ట్ వస్తున్నారని, ప్రజలు వైద్య శిబిరానికి వచ్చి సేవలు పొందాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి

గుడిపాల: టెంపో ట్రావెలర్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తికి తీవ్రంగా గాయపడినట్టు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. చిత్తూరు-వేలూరు రహదారిలోని పానాటూరు వద్దనున్న క్రిష్ణ గ్రానైట్ ఫ్యాక్టరీ వద్ద శుక్రవారం ఉదయం వేలూరు నుంచి చిత్తూరు వైపు గుర్తు తెలియని ఓ వ్యక్తి నడుచుకుంటూ వస్తుండగా టెంపో ట్రావెలర్ బస్సు ఢీకొందని తెలిపారు. తలకు బలమైన గాయమైందని, అతన్ని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. అతని గురించి ఎవరికైనా వివరాలు తెలిసినట్లయితే 9440796712 నంబర్‌కు కాల్ చేయాలని ఎస్ఐ తెలిపారు.

కష్టపడి పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు



చారాలలో మాట్లాడుతున్న నాగభూషణరెడ్డి



పులిచెర్ల(కల్లూరు) : మాట్లాడుతున్న శ్రీదేవి రెడ్డి

సదుం: మండలంలో గ్రామ కమిటీలను పటిష్టంగా ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ఆదేశించారు. కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. ఆయన శుక్రవారం కంభంవారిపల్లె పంచాయతీ బల్లావాండ్లపల్లెలో గ్రామ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా గ్రామ కమిటీ సభ్యులు పని చేయాలన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలన్నారు. అదేవిధంగా బూరగమంద, జోగివారిపల్లె, అమ్మగారిపల్లెలోనూ సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ శివారెడ్డి, రమేష్, ఇమ్రాన్, పుత్రాజు, మహేష్, శ్రీరాములు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీలతో పార్టీ బలోపేతం

చౌడేపల్లె: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేసే కార్యకర్తలకు తగిన గుర్తింపునిస్తామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జి.నాగభూషణరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం చారాల, చింతమాకులపల్లె, వెంగళపల్లె పంచాయతీల్లో గ్రామ కమిటీల ఏర్పాటుకు రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయడంతోపాటు కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి సోషల్ మీడియా ప్రతినిధులు కీలకంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నరసింహులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు రుక్మిణమ్మ, వెంకటరెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు వెంకటరమణ, కోఆప్షన్ మెంబరు సాధిక్‌బాషా, సర్పంచులు ఓబుల్‌రెడ్డి, షంషీర్, నాగరత్న, హైమావతి తదితరులు పాల్గొన్నారు.



సదుం వైఎస్సార్ సీపీ నాయకులతో పెద్దిరెడ్డి

గ్రామ కమిటీలే కీలకం

పులిచెర్ల(కల్లూరు) : పార్టీ బలోపేతంతోపాటు రాబోయే ఎన్నికల్లో విజయం సాధించడంలో గ్రామ కమిటీలే కీలకమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి కమలాపురం శ్రీదేవిరెడ్డి తెలిపారు. ఆమె శుక్రవారం పులిచెర్లలో గ్రామ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. కమిటీ సభ్యులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి పార్టీ కార్యక్రమాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రింటింగ్ ప్రెస్ మాజీ చైర్మన్ గోటూరి మురళీమోహన్‌రెడ్డి, రెడ్డీశ్వరరెడ్డి, హేమసుందరరెడ్డి, మిద్దింటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



రొంపిచెర్ల-1 అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది

రొంపిచెర్ల: గర్భిణులు, బాలింతలు సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా వుంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష తెలిపారు. ఆమె శుక్రవారం రొంపిచెర్ల-1, వారణాసివారిపల్లె అంగన్‌వాడీ కేంద్రాల్లో రాష్ట్రీయ పోషణమాసం కార్య క్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సంపూ ర్ణ ఆరోగ్యం కోసం గర్భిణులు, బాలింతలు శారీరక శ్రమ పెంచుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాల ని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త సితార, అంగన్‌వాడీ కార్యకర్తలు అలివేలు, హసీన, సంపత్‌కుమారి, లావణ్య, లక్ష్మీదేవి, లక్ష్మీ పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: సమతుల్య ఆహారంతో ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజరు మల్లీశ్వరి తెలిపారు. మండలంలోని 79 ఏ చింతమాకులపల్లెలో శుక్రవారం పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ స్థానికంగా దొరికే ఆకుకూరలు, ధాన్యాలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. బూరగమంద, పాపిరెడ్డివారిపల్లె, తాటిగుంటపాలెం, చింతలవారిపల్లె గ్రామాల్లోని కేంద్రాల్లోనూ కార్యక్రమం నిర్వహించారు. డాక్టరుచరణ్, జానకి, శిఖామణి, నీలకంఠ పాల్గొన్నారు.

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు) : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ పులిచెర్ల ప్రాజెక్టు సీడీపీవో వాణిశ్రీదేవి తెలిపారు. ఆమె శుక్రవారం కల్లూరు-3, బాలిరెడ్డిగారిపల్లె అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తదితరాలు తినాలన్నారు.

బాబూ...ఇదిగో మదనపల్లె మెడికల్ కాలేజీ



మదనపల్లె మెడికల్ కాలేజీని చూపిస్తున్న సుబ్రహ్మణ్యంనాయుడు, చంద్రారెడ్డి తదితరులు

మదనపల్లె రూరల్/పలమనేరు : వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మెడికల్ కాలేజీల నిర్మాణాలు జరగలేదని గోబెల్స్ ప్రచారం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఇదిగో మదనపల్లె మెడికల్ కాలేజీ చూడండంటూ చిత్తూరు జిల్లా యువజన విభాగం వైస్ ప్రెసిడెంట్ ఆర్.వి.సుబ్రహ్మణ్యం నాయుడు సెల్ఫీ తీసి చూపించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ సీపీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన చలో మెడికల్ కాలేజీ కార్యక్రమంలో పలమనేరు నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో యువకులు హాజరయ్యారు. 70 శాతం పనులు పూర్తయిన కాలేజీని నిర్మాణమే జరగలేదని చెప్పేందుకు ప్రభుత్వానికి మనసెలా వచ్చిందని ప్రశ్నించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాలేజీలను ప్రారంభించారని తెలిపారు. వాటిని ప్రారంభిస్తే వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి మంచి పేరు వస్తుందనే అక్కసుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలనుకోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. లేనిపక్షంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలమనేరు నియోజకవర్గం యూత్ ప్రెసిడెంట్ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



పెద్దపంజాణి : రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి మురళి

పెద్దపంజాణి: స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కింద నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పెద్దపంజాణి, రాయలపేట పీహెచ్‌సీల వైద్యాధికారులు మురళి, మాధవి తెలిపారు. వారు శుక్రవారం పెద్దవెలగటూరు, నేలపల్లిలో వైద్య శిబిరాలు నిర్వహించి రక్తం, షుగర్, డెంగీ, మలేరియా పరీక్షలు చేశారు. సీజనల్, చర్మవ్యాధులపై అవగాహన కల్పించారు.

మహిళలకు వైద్య పరీక్షలు

పుంగనూరు : స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఏరియా ఆస్పత్రి వైద్యాధికారి మధుసూదనాచారి కోరారు. ఆయన శుక్రవారం మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. వైద్య సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శమీపతి, డాక్టర్లు పవన్‌కుమార్, సృజన తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పులిచెర్ల(కల్లూరు) : మండలంలోని మంగళంపేటలో శుక్రవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కింద మహిళలకు వైద్య పరీక్షలు చేసినట్టు మెడికల్ ఆఫీసరు వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బాలింతలు, గర్భిణులకు కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆరోగ్యసిబ్బంది శ్రీదేవి, పురుషోత్తం, ప్రమీల, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.